క్లుప్తంగా

తాత్కాలిక అంగళ్ల ఏర్పాటుకు వేలంపాట


వేలంపాటలు నిర్వహిస్తున్న అధికారులు

దుత్తలూరు: నర్రవాడలో బ్రహ్మోత్సవాల సందర్భంగా తాత్కాలిక అంగళ్ల ఏర్పాటుకు మంగళవారం బహిరంగ వేలంపాటలు నిర్వహించారు. జూన్ 15 నుంచి 19వ తేదీ వరకు అంగళ్లు ఏర్పాటు చేసుకునేందుకు స్థానిక సచివాలయంలో సర్పంచ్ ఇలారి నాగయ్య అధ్యక్షతన బహిరంగ వేలంపాటలు ఏర్పాటు చేయగా, ప్రొద్దుటూరుకు చెందిన పప్పు గోవింద్ రూ.2 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హనుమంతరావు, డిప్యూటీ ఎంపీడీఓ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి మాధవ్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో డీఎంహెచ్‌ఓ తనిఖీ


నర్రవాడ పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

దుత్తలూరు: దుత్తలూరు, నర్రవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిణి(డీఎంహెచ్‌ఓ) సుజాత మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఫార్మసీ, ల్యాబ్, కాన్పుల గదులను పరిశీలించారు. వైద్యశాలలో అందుతున్న ఆరోగ్య సేవలు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ వైద్యశాలలో ఓపీ, కాన్పుల శాతం పెంచాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో ఆయా వైద్యశాలల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధేశ్వరంలో ఉన్నతాధికారుల పూజలు



సీతారామపురం: ప్రాచీన శైవక్షేత్రమైన ఘటిక సిద్ధేశ్వరం ఆలయంలో జెడ్పీ సీఈఓ విద్యారమ, డ్వామా పీడీ గంగాభవానీలు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయగిరిలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న వారు శైవక్షేత్రాన్ని సందర్శించి పరమశివునితో పాటు ఇష్టకామేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ అర్చకులు ఉన్నతాధికారులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయ విశిష్టతను వివరించి స్వామివార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.

18న కలప వేలం

ఆత్మకూరురూరల్ : ఆత్మకూరు పట్టణంలో పాత ఎంపీడీఓ కార్యాలయ భవనాన్ని ఇటీవల కూల్చివేసినందున అందుకు సంబంధించిన కలపను ఈనెల 18న ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వేలంపాట నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి ఎంపీడీఓ డేవిడ్ మంగళవారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. వేలం పాడుకున్న వారు 48 గంటల్లోగా పూర్తి మొత్తం చెల్లించాలన్నారు.

యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలి


మాట్లాడుతున్న మంత్రి ఆనం

ఆత్మకూరు: నియోజకవర్గంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్నిశాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులకు సూచించారు. నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ యాక్షన్ ప్లాన్‌పై అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. యాక్షన్ ప్లాన్‌లో పొందుపరిచిన లక్ష్యాలను చేరుకునేందుకు పక్కా ప్రణాళికతో పనిచేయాలని అధికారులు సూచించారు. ఈ సమావేశంలో ఆత్మకూరు ఆర్డీఓ, నియోజకవర్గ ప్రత్యేకాధికారి పావని, చీఫ్ ప్లానింగ్ అధికారి రఘురామయ్య, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి

ఆత్మకూరు: ఇటీవల ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో కూలీలతో వెళ్తున్న ఆటోను కారు వేగంగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా పలువురు గాయపడిన విషయం తెలిసిందే. ఇందులో తీవ్రగాయాల పాలైన షేక్ సలీమాను (45) మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు.

నిబంధనలకు తూట్లు



ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటవుతున్న వెంచర్లు

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అనధికార లేఅవుట్‌లు
- పట్టించుకోని మున్సిపల్, రెవెన్యూ అధికారులు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఇటీవల కాలంలో అనధికారికంగా పలు వెంచర్లు, లేఅవుట్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వీటి గురించి పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తమకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో రియల్టర్ల పని మూడు ప్లాట్లు, ఆరు వెంచర్లు అన్న విధంగా సాగుతోంది.

కొన్నింటికే హెచ్చరిక బోర్డులు

పట్టణ పరిధిలో అనధికార లేఅవుట్‌ల వేగంగా వెలుస్తున్నాయి. సర్వే నంబర్లు 1052/1, 1048/1, 1048/2లలో గతంలో లేఅవుట్‌లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వాటిలో ప్లాట్లు కొనరాదని, వాటికి ఎలాంటి అనుమతులు లేవని కమిషనర్ పేరుతో ఈ బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల కొత్తగా వెలుస్తున్న పలు అనధికార లేఅవుట్‌లలో పనులు జరుగుతున్నా వాటిని పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తుండడంతో పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ కొత్త లేఅవుట్ల విషయంలో మున్సిపల్ అధికారులకు, మీడియేటర్‌గా వ్యవహరించిన ఓ టీడీపీ నాయకుడికి, ఎకరాకు రూ.5 లక్షలు చొప్పున సంబంధిత రియల్టర్లు ముట్టజెప్పినట్లు పలువురు పేర్కొంటుండడం గమనార్హం. సర్వే నంబర్ 1086, 1087లలో 2.5 ఎకరాల్లో ఓ రియల్టర్ ప్లాట్లు వేస్తున్నాడు. అదే క్రమంలో సర్వే నంబరు 893, 894లలో 1.2 ఎకరాల్లో మరో రియల్టర్ ప్లాట్లు వేస్తున్నాడు. వీటి విషయంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఎందుకు ప్రశ్నించడం లేదని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడానికి కారణం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత నెలలో మున్సిపల్ పరిధిలోని నెల్లూరు–ముంబై రహదారిపై అన్ని అనుమతులతో పూర్తి చేసిన నూతన పెట్రోల్ బంక్‌ను ప్రారంభించే ముందు రోజు చిన్న కారణాలు చూపి అడ్డుకున్నారు. అయితే మున్సిపల్ అధికారులు ఈ లేఅవుట్ విషయంలో ఎన్ని పెద్ద తప్పులు జరుగుతున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంలో రహస్యం ఏమిటని ప్రజలు అడుగుతున్నారు.

పరిశీలించుకుని విక్రయాలు చేయాలి

దీనిపై మున్సిపల్ కమిషనర్ గంగాధర్‌ను సంప్రదించగా సరైన ఆధార పత్రాలు చూపించకపోవడంతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన వాటిని పరిశీలిస్తామని తెలిపారు. ఏదేమైనా ప్లాట్లు కొనుగోలు చేసే క్రమంలో పూర్తి రికార్డులు పరిశీలించుకుని క్రయ విక్రయాలు చేయాలని ఆయన అన్నారు.

పోరంబోకు స్థలం ఆక్రమణ


మాట్లాడుతున్న సర్పంచ్ మల్లికార్జున


ఆక్రమించిన స్థలంలో చేపడుతున్న నిర్మాణాలు

కొండాపురం: తమ పంచాయతీకి చెందిన వాగు పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని గానుగపెంట సర్పంచ్ మంచాల మల్లికార్జున కొండాపురం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే నంబర్ 18లో రెండెకరాల వాగు పోరంబోకు భూమి ఉందన్నారు. ఆ భూమిలో కొండాపురానికి చెందిన ఓ వ్యక్తి అనేక నిర్మాణాలు చేపడుతున్నాడని వాపోయారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఆ స్థలం వాగు పోరంబోకుగా ఉందన్నారు. అయినా కూడా దానిని అన్యాక్రాంతం చేసి అక్రమంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. దీనిపై రెవెన్యూ అధికారులతో పాటు కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో అర్జీ ఇచ్చామన్నారు. అయినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. కొండాపురం–కలిగిరి ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన లక్షలాది రూపాయలు విలువ చేసే స్థలాన్ని ఆక్రమించి అన్యాక్రాంతం చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

అడవి పేరంటాలమ్మకు విశేష పూజలు



ఉదయగిరి రూరల్: మండలంలోని గన్నేపల్లి పంచాయతీలో అడవి పేరంటాలమ్మ తల్లికి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో అమ్మవారికి మేడేపల్లి వెంకటయ్య–చెన్నమ్మ దంపతులు వెండి దీపారాధన కుందులు బహూకరించారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక వాహనంలో ప్రతిష్టించి మిట్టపల్లి, గడ్డంవారిపల్లె, జెట్టివారిపల్లి, అడవి పేరంటాలమ్మ నగర్ గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

వ్యవసాయ పథకాలపై అవగాహన

చేజర్ల(ఆత్మకూరు): మండల కేంద్రమైన చేజర్లలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసన్న రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, వరిరకాల గురించి వివరించారు. జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న ఉద్యాన పథకాలపై సూచనలు చేశారు. శాస్త్రవేత్త డాక్టర్ సురేఖాదేవి భూసార పరీక్షలలో ఆధునిక పద్ధతుల గురించి వివరించారు. వివిధ పంటలలో వేపనూనె పిచికారీ ఆవశ్యకతను రైతులకు తెలియజేశారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ నాయక్ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

• **అనుమసముద్రంపేట:** మండలంలోని అనుమసముద్రం గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. హైదరాబాద్‌లోని భారత వరి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ నాగేశ్వరరావు రైతులకు పలు సూచనలు చేశారు. ఏఈఓ భాగ్యలక్ష్మి, వీఏఏ శ్రీహరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కస్తూరి, అంగన్‌వాడీ టీచర్లు, ఏపీఎం శ్రీలత పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన సోషల్ మీడియా కన్వీనర్



కలిగిరి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ మండల సోషల్ మీడియా కన్వీనర్ కుట్టుబోయిన పవన్‌కుమార్ మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు మాజీ వార్డు సభ్యుడు ఖాజా మొయినుద్దీన్ ఉన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు

దగదర్తి: మండల పరిధిలోని జాతీయ రహదారిపై నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్సై జంపానికుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం మాట్లాడారు. ఇటీవల జాతీయ రహదారిపై రాత్రి వేళల్లో దొంగలు హల్‌చల్ చేశారని, లారీలు, కార్ల వద్ద చోరీలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ క్రమంలో

ఉపాధి పనులు పారదర్శకంగా జరగాలి


ఎంపీడీఓ శ్రీదేవికి వినతిపత్రం అందజేత

కావలి(జలదంకి): ఉపాధి హామీ పనులు పారదర్శకంగా జరిగేలా చూడాలని కావలి పట్టణ సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీదేవికి వినతిపత్రం అందించారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న కుటుంబాలకు కూడా ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తాళ్లూరి మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పి.సీతారామయ్య, నరేష్, ఎం.రాధాకృష్ణయ్య, కె.జాన్ తదితరులు పాల్గొన్నారు.

యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష నేడు

ఆత్మకూరు: స్వర్ణాంధ్ర–2047 యాక్షన్ ప్లాన్‌పై రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 11 గంటలకు సమీక్ష సమావేశం నిర్వహిస్తారని ఆర్డీఓ పావని మంగళవారం తెలిపారు. శాఖల వారీగా ప్రాధాన్యత కలిగిన అంశాలు, అభివృద్ధి ప్రణాళికలు, అమలు చేయాల్సిన కార్యాచరణ పట్ల చర్చ జరుగుతుందన్నారు.

హనుమంత వాహనంపై ఆత్మారాముడు



సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెంలో ఆత్మారామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి స్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సుందరంగా అలంకరించిన రథంపై స్వామివారిని ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థికి రాష్ట్రస్థాయి అవార్డు


జశ్వంత్

కలిగిరి: కలిగిరిలోని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఎస్.జశ్వంత్ పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయి షైనింగ్ స్టార్స్ అవార్డు పొందారని ప్రిన్సిపల్ అన్నవరం శ్రీను మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి షైనింగ్ అవార్డులను ఎస్.జశ్వంత్ (591), ఎ.మాధురి (580) కలెక్టర్ చేతుల మీదుగా తీసుకున్నారన్నారు. అదేక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా జశ్వంత్ అవార్డు అందుకున్నట్లు తెలిపారు.

నంది వాహనసేవలో స్వామివారు



సంగం: మండలంలోని దువ్వూరు గ్రామంలో గంగాపార్వతి సమేత కోటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం అర్ధరాత్రి నంది వాహనంపై స్వామి, అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక అలంకరణతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రభుత్వ పాఠశాలలకు సన్నబియ్యం

ఉదయగిరి రూరల్: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సన్న బియ్యాన్ని పంపిణీ చేసినట్లు ఎంఈఓ–1 షేక్.మస్తాన్‌వలీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పాఠశాలలకు సన్న బియ్యం పంపిణీ చేసిందన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగా చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉదయగిరి: యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఇన్‌చార్జి కలెక్టర్ కె.కార్తీక్ తెలిపారు. పట్టణంలోని రంగనాయకులస్వామి ఆలయ ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ యోగాను ప్రతిఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు. ఆరోగ్యం బాగుపడాలన్నా, జీవనశైలిలో మార్పు రావాలన్నా యోగాతోనే సాధ్యమవుతుందన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవాలన్నారు. పర్యాటక రంగ అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారిణి ఉషశ్రీ, నోడల్, జిల్లా స్పోర్ట్స్ అధికారి యతిరాజ్, డీఎంహెచ్‌ఓ సుజాత, జెడ్పీ సీఈఓ విద్యారమ, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు గంగాభవాని, నాగరాజకుమారి, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, ఎంపీడీఓ అప్పాజీ, తహసీల్దార్ సుభద్ర, ఎంఈఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి


హాజరును పరిశీలిస్తున్న నిర్మలాదేవి

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణా కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని మెళకువలు నేర్చుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి పేర్కొన్నారు. ఆమె మంగళవారం కుట్టు శిక్షణా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరును పరిశీలించి శిక్షణకు హాజరైన వారితో ముచ్చటించారు. అనంతరం మాట్లాడుతూ ఇక్కడి హాజరు 80 శాతం తగ్గకుండా ఉండాలన్నారు. శిక్షణ అనంతరం మెషీన్లు అందిస్తామన్నారు. అనంతరం వారు కుట్టిన దుస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్లు ఎస్.పద్మా, సి.సుమతి, ఎంపీడీఓ అప్పాజీ, నిర్వాహకురాలు నాజియా తాజున్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు డిపోలో డయల్ యువర్ డీఎం



ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో అనంతసాగరం, చేజర్ల, ఆత్మకూరు మండలాలకు చెందిన పలువురు ప్రయాణికులు పలు సమస్యలను తెలియజేశారు. అనంతసాగరం నుంచి బద్వేల్, చెన్నై వెళ్లేందుకు ప్రత్యేక సర్వీసు కావాలని, సంగం నుంచి చేజర్లకు తిరిగే బస్సును కొనసాగించాలని, నెల్లూరుపాళెం సెంటర్‌లో జాతీయ రహదారిపై విశాలమైన బస్‌షెల్టర్లు నిర్మించాలని కోరారు. దీనిపై ఉన్నతాధికారులకు తెలియజేసి తగిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ డిపో మేనేజర్ రాజ్‌కుమార్ తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు మేకపాటి చిన్నారెడ్డి పాల్గొన్నారు.

13 వరకు బస్ పాసుల జారీ నిలిపివేత

ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో ఈనెల 11 నుంచి 13 వరకు బస్ పాసుల జారీని నిలిపివేస్తున్నట్లు రాజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సన్మానం



ఉదయగిరి రూరల్ : ఇటీవల అజ్మీర్‌లో ఆలిండియా సూఫీ సజ్జాదానషీన్ కౌన్సిల్ (ఏఐఎస్ఎస్‌సీ) ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఉదయగిరి వాసి అహ్మద్‌బాషా ఖాలిదిని స్థానిక ఆస్థాన ఖాదరియాలో పలువురు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ ఇస్లాం శాంతిని, పరమత సహనాన్ని కోరుకుంటుందన్నారు. రాజస్థాన్‌లోని అజ్మీర్ కేంద్రంగా పనిచేస్తున్న ఏఐఎస్ఎస్‌సీ స్వచ్ఛంద సంస్థ ఇటీవల తనను ఏపీ తరఫున ప్రతినిధిగా ఎన్నుకుని జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించారన్నారు. అనంతరం తీవ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ పహల్గాం దురాగతాన్ని ఆయన ఖండించారు. అబ్దుల్ అజీజ్, ఫయాజ్, విశ్రాంత ఎంఈఓ అల్లాభక్షు, ఉదయగిరి జిల్లా సాధన కమిటీ అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, జేవీవీ నాయకులు దస్తగిరి అహ్మద్, స్థానికులు ఖాజా, మహబూబ్ మస్తాన్, యస్దానీ తదితరులు పాల్గొన్నారు.

కిలో పొగాకు సగటు ధర రూ.234.28

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం కిలో పొగాకు సగటు ధర రూ.234.28 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 472 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 313 పొగాకు బేళ్లను కొనుగోలు చేయగా వివిధ కారణాలతో 159 బేళ్లను తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి టి. ఇషాక్ స్వర్ణదత్ మాట్లాడుతూ కిలో పొగాకుకు గరిష్టంగా రూ. 280, కనిష్ట రూ.180 ధర లభించిందన్నారు. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

డీసీపల్లిలో 557 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం 557 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 901 బేళ్లు రాగా 557 బేళ్లు విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. కిలోకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.180 లభించింది. సగటున రూ.228.55 ధర లభించింది. వేలంలో 10 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

పనులు కల్పించాల్సిన బాధ్యత ఎఫ్‌ఏలదే

• డ్వామా పీడీ గంగాభవాని


మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

ఉదయగిరి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాల్సిన బాధ్యత క్షేత్ర సహాయకులదేనని డ్వామా పీడీ గంగాభవాని తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు కూలీల సంఖ్యను పెంచాలన్నారు. ఉద్యాన పంటలపై ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి సాగుకు ప్రతిపాదనలు తయారు చేసి పంపాలన్నారు. కూలీలకు కొలతల ప్రకారం పనులు కేటాయించి ప్రభుత్వం నిర్దేశించిన గిట్టుబాటు కూలి పొందేలా చూడాలన్నారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. కూలీలకు పనుల కేటాయింపులో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

‘బహిష్కరణ చేయనున్నారు.. కాపాడండి’

ఆత్మకూరు: తమపై కొందరు కక్షగట్టి గ్రామ బహిష్కరణకు కుట్ర చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని బసవరాజుపాళెం దళితులు వాపోయారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయంలో వారు ఏఓ నిరంజన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఆత్మకూరు మండలంలోని బసవరాజుపాళెం గ్రామానికి చెందిన విజయ్ అనే దళిత యువకుడు బహిర్భూమికి వెళ్లిన క్రమంలో మహిమలూరుకు చెందిన నర్సింహులు అనే వ్యక్తి కులంపేరుతో దూషించారని, ఈ విషయంపై జిల్లా ఎస్పీ ఆదేశాలతో కేసు నమోదు చేశారని తెలిపారు. దీంతో తమపై కోపంతో మహిమలూరుకు చెందిన అగ్రవర్ణాల వారు తమకు తాగునీరు రాకుండా చేయడంతో పాటు పనులకు దళితులను దూరంగా ఉంచేలా గ్రామంలో సమావేశాలను నిర్వహించుకున్నారని, ఇలా సాంఘిక బహిష్కరణ చేయడంతో పాటు మమ్మల్ని బెదిరిస్తున్నారని వాపోయారు.

అక్రమంగా కేసు బనాయించారు

ఆత్మకూరు: మండలంలోని మహిమలూరు గ్రామ మజరా బసవరాజుపాళెం గ్రామానికి చెందిన ఓ యువకుడు తమ గ్రామానికి చెందిన నర్సింహులుపై అక్రమంగా కేసు బనాయించారని మహిమలూరు గ్రామానికి చెందిన పలువురు ఆత్మకూరు డీఎస్పీ కె.వేణుగోపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన పలువురు మంగళవారం ఆత్మకూరు డీఎస్పీ కార్యాలయానికి చేరుకుని జరిగిన విషయాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అన్యాయంగా అట్రాసిటీ కేసు నమోదు చేశారని వారు పేర్కొన్నారు.

27 మందికి కంటి శస్త్రచికిత్సలు



వింజమూరు(ఉదయగిరి): స్థానిక వైఆర్ జూనియర్ కళాశాలలో ఎన్నారై సేగు సతీష్ సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరంలో మంగళవారం 27 మందికి చెన్నైలోని శంకర నేత్రాలయ వైద్య బృందం కంటి పొర శస్త్రచికిత్సలు నిర్వహించారు. మొబైల్ ఆపరేషన్ థియేటర్ ద్వారా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కంటి వైద్యుడు గజేంద్ర కుమార్ వర్మ మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ వరకు అవసరమైన వారికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేస్తామని తెలిపారు. దేశవ్యాప్తంగా మొబైల్ ఆపరేషన్ థియేటర్ల ద్వారా ఏడాదికి 3,500 మందికి కంటి శస్త్రచికిత్సలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందులో భాగంగా వింజమూరులో క్యాంపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.